క్లుప్తంగా

ఓంకార్ మాస్టారుకు నివాళి

పలాస: కళాకారుడు, సామాజిక సేవా తత్పరుడు, ఉపాధ్యాయ నేత బత్తిన ఓంకార్ మాస్టారుకు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం సోమవారం ఘనంగా నివాళి అర్పించింది. పలాస మండలం మాకన్నపల్లికి చెందిన ఆయన ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జాపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కళాపీఠంతో అతనికి ఉన్నటువంటి అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలో రైతులు, కిడ్నీ వ్యాధి సమస్యలపై స్పందించి ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. సమావేశంలో కూర్మారావుతో పాటు సాలిన జోగారావు, అందాల కోటేశ్వరరావు, శిష్ట మనోజ్‌కుమార్, దున్న సోమేశ్వరరావు, రాపాక సోమేశ్వరరావు, అమ్మ రామక్రిష్ణ, బైనపల్లి కాంతమ్మ, నల్ల లత పాల్గొన్నారు.

వైఎస్ ఎంపీపీకి ఎమ్మెల్సీ పరామర్శ


వివేకానందరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వు వివేకానంద రెడ్డి తల్లి రమణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం ఈదుపురంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి సంతాపం తెలియజేశారు. రమణమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావు, నీలాపు ఢిల్లీ, పిలక సంతూ, బుడుపు త్రినాథ్ ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు


ప్రకాష్‌నగర్ కాలనీలో సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది సోమవారం రైతుబజార్, మెయిన్‌రోడ్డు, కరణాలవీధి, ప్రకాష్‌నగర్ కాలనీ, వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రపరిచారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో దూరంగా తరలించారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో పంచాయతీలో ఎక్కడా పారిశుద్ధ్యం క్షీణించకుండా తగుచర్యలు తీసుకుంటున్నామని ఈవో చింతాడ సన్యాసి తెలపారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


దుస్తులు పంపిణీ చేస్తున్న నారీమణి ట్రస్ట్ ప్రతినిధులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ గ్రామంలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి పంచామృత మహా అభిషేకాన్ని జరిపించారు. సహస్రనామ పూజలు, మహాహోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు వేద పండితులు బూరాడ విశ్వగురునాథశర్మ ఆధ్వర్యంలో చేశారు. అనంతరం నారీమణి ట్రస్ట్ ద్వారా చెన్నూరు దుర్గారావు బాబ్జీ దంపతులు చేతుల మీదుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పోకల నగేష్‌శర్మ ఉన్నారు.

జనజాగృతి అధ్యక్షుడిగా కుమార్‌నాయక్


డాక్టర్ కుమార్‌నాయక్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 2024–26 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డాక్టర్ కుమార్ నాయక్, కార్యదర్శిగా బండారు కాళిదాసు, కోశాధికారి బాలక్రిష్ణ వర్మ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస బాబ్జీ నియామకమయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కంచిలి: మొక్కలు నాటడాన్ని ప్రతీ పౌరుడు బాధ్యతగా చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కంచిలి పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్స్ డే సందర్భంగా పర్యావరణాన్ని కాపాడే దిశగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కలు పెంచడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

● ఆర్డీవో భరత్‌నాయక్


ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురంలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

ఇచ్ఛాపురం రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్టు పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ అన్నారు. ఇచ్ఛాపురం మండలంలోని బాలకృష్ణాపురం, బిర్లంగి, బొడ్డబడ, మశాఖపురం గ్రామాల్లో సోమవారం చేపటిటన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వర్ డౌన్ కారణంగా సకాలంలో పింఛన్లు పంపిణీ చేయలేకపోతున్నామని పలువురు అధికారులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. సిగ్నల్ వచ్చే ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేయాలని, ఒకేచోట కాకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందించాలని సిబ్బందిని సూచించారు. మంగళవారం వరకు సమయం ఉన్నందున పంపిణీదారులు గమనించాలని అన్నారు. తొలిరోజు మండలంలో 80 శాతం మాత్రమే పంపిణీ జరిగిందని అన్నారు. ఇచ్ఛాపురం తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, ఎంపీడీవో వై.వి. రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: మండల వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీని ఉద్యోగులు పంపిణీ చేశారు. ఈదుపురంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎంపీటీసీ సభ్యురాలు మేరుగు సీత, సర్పంచ్ నర్తు వరప్రసాదరావు, కార్యదర్శి విజయలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి: కూటమి ప్రభుత్వం నేతృత్వంలో అమలు చేసిన ఎన్టీఆర్ భరోసాతో పింఛన్‌దారులకు ఎంతో భరోసా కలుగుతుందని టెక్కలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు కోళ లవకుమార్ అన్నారు. పట్టణంలోని పలువురుకి పింఛన్లు అందించారు. టీడీపీ నాయకులు టీఎస్ఎన్.రమణ, కె.రామ్‌ప్రసాద్, ఎల్.దుర్గారావు, పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ, మేఘవరం, సంతబొమ్మాళి, నౌపడ, మర్రిపాడు, మూలపేట, బోరుభద్ర తదితర పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు.

పలాస: పలాస మండల వ్యాప్తంగా పింఛన్లను ఉద్యోగులు, స్థానిక నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. బ్రాహ్మణతర్లా గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష పింఛన్లను అందజేశారు. బొడ్డపాడులో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ తామాడ మదన్‌కు సచివాలయం సిబ్బంది ఆహ్వానం పలకగా స్థానిక టీడీపీ నాయకులతో పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. టీడీపీ నాయకులు కిక్కర ఢిల్లీరావు, సార జోగారావు ఉన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 23 వార్డుల పరిధిలో పింఛన్లను పంపిణీ చేశారు. ఆర్డీవో భరత్‌నాయక్ పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు లబ్ధిదారులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల తహసీల్దార్ ఎం.బి.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

కంచిలి: కంచిలి మండల వ్యాప్తంగా 95.56 శాతం మందికి తొలిరోజు పింఛన్లు పంపిణీ చేశారు. 9,784 మంది లబ్ధిదారులకుగాను 9,350 మందికి అందజేశారు. గొల్లకంచిలిలో తహసీల్దార్ ఎం.వి.కె.ఎస్.రవి చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీవో వి.నీరజ పాల్గొన్నారు.

కేసరపడలో ఇతరులు పంపిణీ!

కంచిలి మండలంలోని కేసరపడ గ్రామంలో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ ఉద్యోగులకంటే ఇతరుల హడావుడి ఎక్కువగా కనిపించింది. స్థానిక సచివాలయ సిబ్బందిని పక్కన పెట్టి స్థానిక యువకులు కొందరు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు సేకరించడం వంటివి చేశారు. వీరి ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పింఛన్ల పంపిణీ జరిగింది 21వ వార్డులో శతశాతం దివ్యాంగుడైన గొర్రెల జోగారావుకు 15 వేల రూపాయలు పింఛన్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు దానేటి పద్మజ, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, గొల్ల చంద్రరావు ఉన్నారు.

కవిటి: కవిటీ మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణి పూర్తయిందని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రగడపుట్టుగలో ఎమ్మెల్యే సతీమణి బెందాళం నీలోత్పల పింఛన్లను పంపిణీ చేశారు. పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ ఎం లక్ష్మి, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ శివాజీపాణిగ్రాహి పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి:డీఎల్‌పీవో

వజ్రపుకొత్తూరు: ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉద్దానం రామక్రిష్ణాపురం, పాతటెక్కలి పంచాయతీల్లో పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. వజ్రపుకొత్తూరు మండలంలో 95.53 శాతం పింఛన్లు పంపిణీ అయినట్లు ఎంపీడీఓ డిక్కల తిరుమలరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 11,703 సామాజిక భద్రతా, ఇతర పింఛన్లు ఉండగా అందులో 510 పింఛన్‌లు మాత్రమే పంచేందుకు మిగిలిపోయాయి. ఇందులో వలసలు, డెత్‌లు ఉంటాయని 2వ తేదీ కల్లా పంపిణీ పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. మాజీ సర్పంచ్ చింత నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి చమళ్ల మధుసూదనరావు ఉన్నారు.

మండపాల వద్ద పింఛన్ల పంపిణీ!

సోంపేట: మండలంలోని కూటమి కార్యకర్తలు, నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇంటి వద్దకే అందించే సామాజిక పింఛన్లను లబ్ధిదారులను మండపాల వద్దకు రప్పించి పంపిణీ చేశారు. మండలంలోని కొర్లాం పంచాయతీ బ్రాహ్మణ కొర్లాం గ్రామంలో మండపం వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీస సమాచారం లేకుండా పింఛన్లు పంపిణీ చేయడంతో ప్రోటోకాల్ విస్మరించడం తగదని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. లక్కవరం గ్రామంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ పింఛన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.

నందిగాం: నందిగాం మండలంలో 95 శాతం పింఛన్లు పూర్తయినట్టు ఎంపీడీఓ టి.రాజారావు తెలిపారు. మండలంలో 9,865 పింఛన్‌దారులు ఉండగా 9,323 మందికి పంపిణీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు. హరిదాసుపురంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు.


కంచిలి: గొల్లకంచిలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఎం.వి.కె.ఎస్.రవి


వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామక్రిష్ణాపురంలో పింఛన్లు అందజేస్తున్న డీఎల్‌పీఓ ఐ.వి.రమణ


కంచిలి: కేసరపడలో లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తున్న ఇతరులు


కాశీబుగ్గ: రూ.15 వేల పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష


సోంపేట: లక్కవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బి.అశోక్


నందిగాంలో పింఛన్ అందజేస్తున్న తహసీల్దార్ పద్మావతి

పింఛన్ పాట్లు!

● సాంకేతిక సమస్యతో పడిగాపులు

వజ్రపుకొత్తూరు రూరల్: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గ్రామ వలంటీరు వ్యవస్థను పక్కన పెట్టి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సోమవారం ఉదయం ఆరు గంటలకే గ్రామాలకు చేరుకున్న సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ప్రారంభించిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం తలెత్తడంతో అటూ ఉద్యోగులు, ఇటు పింఛన్ లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. ఏమి చేయాలో తెలియక అధికారులు సైతం తలలు పట్టుకున్నారు. సిగ్నల్ కోసం గ్రామ శివారు ప్రాంతాలకు అవ్వాతాతలు, దివ్యాంగులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ సిగ్నల్, సాంకేతిక సమస్య పరిష్కారం కాకపోవడంతో గంటలకొద్ది వారు పడిగాపులు కాశారు.

వృద్ధులకు తప్పని పాట్లు

ఇచ్ఛాపురం రూరల్: గత ప్రభుత్వ హయాంలో అవ్వాతాతలకు, అక్కా, చెల్లమ్మలకు సూర్యుడు ఉదయించక ముందే వలంటీర్ చిరునవ్వుతో పలకరిస్తూ పింఛన్ సొమ్ము చేతికి ఇచ్చేవాడు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి నెలలోనే పింఛన్‌దారులకు కష్టాలు తప్పలేదు. సోమవారం ఉదయం నుంచే తమకు ఇంటి వద్దకు పింఛన్ ఎవరు తెచ్చి ఇస్తారంటూ ఆరా తీస్తూ సచివాలయం, పంచాయతీ కార్యాలయం, గ్రామ మండపాల వద్దకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ నిరాశతో కనిపించారు. సర్వర్‌డౌన్ కావడంతో పాటు పింఛన్‌దారుల ఇళ్లు ఎక్కడ ఉన్నాయో అర్థం కాక పంపిణీదారులు అవస్థలు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో మండపాలపై ఉమ్మడిగా పింఛన్లు పంపిణీ చేయగా, మరికొన్ని ప్రాంతాల్లో టీడీపీ నేతల ఇళ్ల వద్ద సైతం పంపిణీ చేశారు.


వజ్రపుకొత్తూరు రూరల్: గుణుపల్లిలో సిగ్నల్ లేక ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, లబ్ధిదారులు


వజ్రపుకొత్తూరు రూరల్: మెట్టూరులో పింఛన్ కోసం గ్రామ శివారు ప్రాంతానికి చేరిన లబ్ధిదారులు


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం రహదారి పక్కన ఉన్న మండపంపై పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

రక్తదానం సామాజిక బాధ్యత


టెక్కలి: రక్తదానం చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కళాశాలలో రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 98 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పి.చైతన్య, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, స్టూడెంట్ విభాగం ప్రతినిధి శాంతికుమార్, ఎన్ఎస్ఎస్ పీవో కె.మారుతిప్రసాద్, రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.ఎన్.వి.దుర్గాప్రసాద్, కె.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది సునీత, తాతారావు, శరత్‌బాబు ఉన్నారు.

వైద్యులకు సన్మానం

పలాస: పలాసకు చెందిన ఇద్దరు ప్రముఖ వైద్యులను సోమవారం ఘనంగా సన్మానం చేశారు. అంతర్జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు, తమ్మినేని పాపినాయుడులను పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండు దొర, ప్రధాన కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి ఎన్.అప్పారావు, సంయుక్త కార్యదర్శి డాక్టరు కుమార్‌నాయక్, కోఆర్డినేటర్ తెప్పల కృష్ణమూర్తి, ఎల్.ఢిల్లేశ్వరరావు, పి.వెంకటరావు ఉన్నారు.

65 మంది రక్తదానం

ఇచ్ఛాపురం: డాక్టర్స్‌డే సందర్భంగా రోటరీక్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గ్లోబల్ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో ఉద్దానం బ్లడ్‌బ్యాంక్ స్టోరేజ్ సహకారంతో మెగా బ్లడ్‌బ్యాంక్ కార్యక్రమాన్ని స్థానిక రోటరీక్లబ్ వారు నిర్వహించారు. రక్తదాతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, దినేష్‌కుమార్, ప్రాజెక్టు చైర్మన్ వేదవ్యాస్, రోటరీక్లబ్ ప్రతినిధులు తులసీదాస్, సురేష్, శ్యామ్, రామారావు, షణ్ముఖ్ పాల్గొన్నారు.

మకరజోలలో ఉచిత నేత్రవైద్య శిబిరం

కాశీబుగ్గ: మందస మండలం మకరజోల గ్రామంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ రోగులను పరీక్షించారు. 22 మందికి కంటి పరీక్షలు చేశారు.

మొక్కలు నాటివేత

సోంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఐఎంఏ సోంపేట ఆధ్వర్యంలో సామాజిక ఆస్పత్రి వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ యారడి కృష్ణమూర్తి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, శివాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

బోధన అంశాలపై శ్రద్ధ తీసుకోవాలి

టెక్కలి: పాఠశాలల్లో బోధన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో డి.తులసీరెడ్డి అన్నారు. తరగతి గదుల్లో బోధన అంశాలపై ప్రధానోపాధ్యాయులు చేపట్టాల్సిన చర్యలపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో–2 డి.చిన్నారావుతో పాటు మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డయేరియా మందులు పంపిణీ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజల్లో నిత్యం అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. కంచిలి పీహెచ్‌సీ ఆవరణలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని, డయేరియా మందులు పంపిణీ కార్యక్రమాన్ని కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎంపీపీ చేతులమీదుగా సోమవారం నిర్వహించారు. సిబ్బందితో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యాధికారి ఎస్.హరి, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు ఆగస్టులోనే సాగునీరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల శివారు గ్రామ భూములకు వంశధార సాగు నీటిని ఆగస్టులోనే అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. చినవంక గ్రామంలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ సాకారంతో నియోజకవర్గ ప్రజలకు మంచి పాలన అందిస్తానని అన్నారు. సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబు చౌదరి, మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి, కూటమి నాయకులు దుర్గారావు, పీరికట్ల విఠల్, సూరాడ మోహన్, రెయ్యి నాగార్జున, అంబటి రామకృష్ణ ఉన్నారు.

సింహాచలంలో అలరించిన మహతీ బృందం


కచేరీ నిర్వహిస్తున్న మహతి కళా బృందం సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: వరహా లక్ష్మీనృసింహ పుణ్యక్షేత్రం సింహాచలంలో మండలానికి చెందిన మహతీ సంగీత బృందం అలరించింది. సోమవారం వరహా లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో సాంస్కృతిక కళావేదికపై మహతి సంగీత బృందం గాన కచేరీ నిర్వహించింది. కళాకారులు దుట్ల వెంకటేశం, పరపటి లింగమూర్తిలు శ్రీరాగ వర్ణంతో ప్రారంభించి నాటరాగంలో మహాగణపతి, కీరవాణి రాగంలో అంభవాని, శ్రీరాగంలో ఎందరో మహానుభావులు, త్యాగరాజ, అన్నమయ్య కృతులు ఆలపించారు. వయోలిన్‌పై తిప్పన ధనుంజయరెడ్డి, మృదంగంపై గౌనప కృష్ణమూర్తి, చలపరాయి వినోద్ కుమార్, బొర్ర హరికుమార్, చలపరాయి సాయిచరణ్‌లు సహకార వాయిద్యం అందించారు. కళాపీఠం ఇన్‌చార్జి మారుతీరావు కళాకారులను సత్కరించారు.

దేవునల్తాడలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


దేవునల్తాడ తీరంలో ప్రచారం చేపడుతున్న కమిటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవని త్రైత సిద్ధాతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సత్రం కమిటీ అధ్యక్షుడు గుండ జనార్ధనరావు అన్నారు. మండలంలోని దేవునల్తాడ గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన సిద్ధాంతం శాస్త్ర బద్ధతతో కూడిన జ్ఞానం అందిస్తోందని, మద్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో గుండ లక్ష్మీకుమారి, సంతోష్, తాతయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో తేడాలొస్తే చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: పేదలకు అందించే పీడీఎస్ బియ్యం పంపిణీలో తేడాలొస్తే ఎండీఎం ఆపరేటర్‌పై చర్యలు తీసుకుంటామని పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ హెచ్చరించారు. మశాఖపురంలో ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీని సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులకు అందించే నిత్యావసర సరుకుల్లో తేడాలు వస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఆపరేటర్లు పారదర్శకంగా వ్యవహరిస్తూ సకాలంలో సరుకులు అందజేయాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.బి.అప్పారావు, డీటీ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

డయేరియాను అరికట్టడమే లక్ష్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కల్యాణి, సర్పంచ్ సంతోష్ మండలా

ఇచ్ఛాపురం రూరల్: ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించడమే మనందరి లక్ష్యమని కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.కల్యాణి అన్నారు. కొళిగాంలో 'స్టాప్ డయేరియా'పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల స్థాయిలో జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు 'స్టాప్ డయేరియా' కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ఇవ్వడంతో పాటు జింక్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య వసతుల్లో సరైన నిర్వహణ, అవసరమైన వైద్య సామగ్రి లభ్యతను నిర్ధారించడం, స్వచ్ఛమైన నీటిని అందుబాటులోకి తేవడం, సురక్షితమైన తాగునీరు అందించడం వంటి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్‌కుమార్ మండలా, ఈవో ప్రసాదరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడుకి సత్కారం


వాసుదేవరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కొత్తపల్లి వాసుదేవరావును సిబ్బంది సోమవారం పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో కురమాన అప్పారావు మాట్లాడుతూ.. మెరుగైన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా మండల, కాంప్లెక్స్ స్థాయిలో ఉన్న పాఠశాలల సిబ్బంది వాసుదేవరావు దంపతులను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సీతంపేట మండల విద్యాశాఖాధికారి సూర్యచంద్రరావు, ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ వై.కల్యాణి, ఇన్‌చార్జి హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా మంత్రిని కలిసిన క్రీడాకారులు


మంత్రులతో తైక్వాండో క్రీడాకారులు

టెక్కలి: క్రీడా శాఖామంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌తో పాటు టెక్కలి తైక్వాండో క్రీడాకారులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నిమ్మాడలోని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన మంత్రిని క్రీడాకారులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడును సన్మానించి సత్కరించారు. తైక్వాండో కోచ్ ఎన్.శేఖర్,సురేష్,జగదీష్ ఉన్నారు.